


# మల్లన్నను వేడుకున్నా..

## ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలి

**ప్రభుత్వ కార్యక్రమాలకు ఆటంకం లేకుండా ఉండాలి**

**కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నది**

**బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**కొమురవెల్లి మల్లన్న సేవలో మంత్రి పొన్నం..**

**ప్రతిపక్షాల మాటలకు స్ట్రాంగ్ కౌంటర్**

సిద్దిపేట, మార్చి 8 సిరిన్యూస్:

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెల నుంచే విమర్శలు మొదలయ్యాయని, ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తున్నాయని బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్అన్నారు. ఆదివారం కొమురవెల్లి మల్లన్న దర్శనం చేసుకున్న ఆయన.. దేవాలయం వద్ద మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి సహకరించి మంచి సమృద్ధి వర్షాలతో, పాడి పంటలతో ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో ఉండాలని మల్లన్నను వేడుకున్నానని చెప్పారు. అంతేగాక ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలి అని కోరుకుంటూ.. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండాలని మల్లన్న ఆశీర్వాదం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నదని చెప్పారు.

గ్రామాల్లో తాగు నీటిని ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కారం కాకపోతే స్థానిక ఎమ్మెల్యే ,మంత్రి దృష్టికి తీసుకురండి అని సూచించారు. అంతేగాక యంగ్ ఇండియా స్పోర్ట్స్ , యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీలు ఏర్పాటు చేస్తున్నామని, పెట్టుబడులు తీసుకొస్తున్నామని, ట్రిపుల్ ఆర్ తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఇక ప్రతిపక్షాలు విమర్శలకు చెక్ పెడుతూ.. ఆర్టీసీ లో మొన్ననే డిఏ ఇచ్చామని, కారుణ్య నియామకాలు చేపట్టామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు శాసన సభలో చట్టబద్ధం చేస్తామని, తరువాత ఢిల్లీ వెళ్లి మద్దతు కోరుతామని చెప్పారు. బీసీ కుల గణనలో స్వచ్ఛందంగా సమాచార సేకరణ జరిగిందని, సమాచారం ఇవ్వని వారికి మరోసారి అవకాశం ఇచ్చామని తెలిపారు. ఇక ఎస్సీ వర్గీకరణ చేస్తున్నామని, దీని కోసం అందరి సహకారం కోరుతున్నామని అన్నారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.ప్రభుత్వం ఏర్పడిన నెల నుండే విమర్శలు చేస్తూ బదనం చేసే ప్రయత్నం చేస్తున్నారని, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మేం అభ్యర్థిని పెట్టలేదని, వాళ్ళు గెలిచినది చెల్లని ఓట్లు కంటే తక్కువ ఓట్లేనని విమర్శలు చేశారు. రంజాన్ గిఫ్ట్ అంటున్న వారికి అవగాహన ఉండాలని, మాకు ఓట్లు వేసిన వారంతా పాకిస్థాన్ వాళ్ళ అని ఫైర్ అయ్యారు. ఎమ్మెల్సీ గెలిపించి గిఫ్ట్ ఇస్తే ములుగు నుండి మంచిర్యాల వరకు 8 లైన్ల రోడ్డు వేయిస్తా అని చెప్పారని, అలాగే కరీంనగర్ నుండి తిరుపతి వెల్లే రైలు ప్రతి రోజు నడిచేలా చేయిస్తానన్నారు. ఇవన్నీ వెంటనే చేయించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ నుంచి తిరుపతికి రెగ్యూలర్ గా రైలు నడిపించే విషయంపై నిన్న కూడా రైల్వే మంత్రికి మరోసారి లేఖ రాశానని తెలిపారు. మొత్తం లక్షా 80 వేల కోట్ల కాంట్రాక్టులకు అనుమతులు తెచ్చుకున్నామని, ప్రభుత్వానికి అందరూ సహకరిస్తే అభివృద్ధి జరుగుతుందని మంత్రి అన్నారు.

## వైభవంగా నల్ల పోచమ్మ తల్లి బోనాలు

**అమ్మవారి దర్శించుకున్న వివిధ పార్టీల నాయకులు**

**గుమ్మడిదల, మార్చి 9 సిరి న్యూస్**



గుమ్మడిదల మండలంలోని అనంతారం గ్రామంలో నల్ల పోచమ్మ తల్లి బోనాల పండగను ఆనందోత్సవాల మధ్య గ్రామస్తులు జరుపుకున్నారు. ఆలయంలో అమ్మవారిని అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు, మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఉదయం నుండి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. ప్రతి మహిళ బోనాల రూపంలో అమ్మవారికి తమ ఇంటి నుండి తీసుకుపోయి బోనాలను మొక్కుల రూపంలో సమర్పించుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం మాజీ సర్పంచ్ దీపా నరేందర్ రెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్, భాస్కర్ గౌడ్, గోపాల్, యాదిరెడ్డి, మహేష్ యాదవ్, తలారి యాదయ్య, లక్ష్మణ్, రమణ, ఆంజనేయులు, కుమార్, సూర్యనారాయణ, యాదగిరి గ్రామస్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

**చిలిపిచేడ్ మార్చి 9 సిరి న్యూస్**



చిలిపిచేడ్ మండలంలోని రహీంగూడ తండా శివారులో శనివారం నాడు జరిగిన కారు ప్రమాదంలో గాయపడిన యువకుడు నాగలి గణేష్ 25 చికిత్స పొందుతూ సంగారెడ్డి లోని బాలాజీ హాస్పిటల్ లో ఆదివారం నాడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శనివారం నాడు మధ్యాహ్న సమయంలో రహీం గూడా నుండి చిలిపిచేడ్ వైపు కారులో యువకుడు అతివేగంగా వెళ్లడంతో కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టగా తీవ్రంగా గాయపడిన యువకుడిని సంగారెడ్డి లోని బాలాజీ హాస్పిటల్ కు తీసుకెళ్లి మెరుగైన వైద్యం అందిస్తుండగా ఆదివారం నాడు యువకుడు మృతి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వివాహిత అదృశ్యం

**చిలిపిచేడ్ మార్చి 9 సిరి న్యూస్**

మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండలం భద్రతాండ గ్రామపంచాయతీ కి చెందిన వివాహిత జే శిరీష తన ఇంటి నుంచి శనివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటిలోంచి వెళ్లిపోయింది. కుటుంబ కలహాలతో ఇల్లు వదిలి వెళ్ళిందని శిరీష భర్త కుమార్ ఎప్పటిలాగే తన తల్లి వారి ఇంటికి వెళ్లి ఉండవచ్చుని వారికి ఫోన్ చేయగా రాలేదు అని చెప్పడంతో బంధువులందరినీ అడిగి తెలుసుకుని ఎక్కడా లేదని తెలియడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు భర్త ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలిపిచేడ్ ఎస్సై నర్సింలు తెలిపారు.